క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



నర్మెట: మండల కేంద్రంలోని కాకతీయుల కాలం నాటి అతి పురాతన శివాలయం పూర్తిగా శిథిలావస్తకు చేరుకుంది. కాగా, గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలోని ఆలయ కమిటీ గ్రామస్తులతో కలిసి రూ.75 లక్షల అంచనా వ్యయంతో పునర్నిర్మాణ పనులను చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం నర్మెట రజక సంఘం రూ. 40 వేలు, ప్రజ్ఞాపురం లక్ష్మి కనకయ్య రూ.10వేల116లు, గంగం మానస సంజీవరెడ్డి రూ.10వేల116లు, ప్రజ్ఞాపురం స్రవంతి సంపత్ రూ. 5వేల116 లు ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ప్రజ్ఞాపురం అంజయ్య, పాపయ్య. నర్సింహులు, యాదగిరి , శ్రీను, మల్లయ్య, శంబయ్య, శ్రీధర్, మల్లేషం, కరుణాకర్, శ్రీనివాస్, రాజేష్, ప్రవీణ్, మల్లేషం, సత్యనారాయణ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే అవార్డులు



స్టేషన్‌ఘన్‌పూర్: విధి నిర్వహణలో అంకిత భావంతో చురుకుగా పనిచేస్తే అవార్డులు వెతుక్కుంటూ వస్తాయని ఎన్పీడీసీఎల్ డీఈ వై.రాంబాబు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎండీ చేతులమీదుగా అవార్డులు పొందిన డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు హరిత, వినీత్ రెడ్డి, బోసాని రాజ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, రంజిత్‌లను ఘన్‌పూర్ డీఈ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఏడీ శ్రీనివాస్, ఏఈ రణధీర్, ఐఎన్‌టీయూసీ ఘన్‌పూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫయాజ్, రమేష్, జనార్ధన్, మోహన్, చంద్రశేఖర్, పెద్దిరెడ్డి, వాసం శ్రీధర్‌పటేల్, గబ్బెట సుధాకర్, ఎండీ అన్వర్‌పాషా, సరిత, రమ్య తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



జనగామ రూరల్: ప్రాణాపాయ స్థితి నుంచి ఒకరిని కాపాడిన రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ గోపాల్‌రావుకు పసరమడ్ల గ్రామస్తులు అభినందనలు తెలిపి సన్మానించారు. డిసెంబర్ 12వ తేదీన మండలంలోని పసరమడ్ల గ్రామానికి చెందిన బోయిని సుభాష్ కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయాన్ని ప్రయత్నించగా కుటుంబీకులు జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కొన ఊపిరితోటి కొట్టుమిట్టాడుతున్న సుభాష్‌ను డాక్టర్ మాచర్ల భిక్షపతి, స్టాఫ్ నర్సులు చికిత్స అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు.. డాక్టర్ భిక్షపతి, గోపాల్‌రావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. అరవింద్, భాస్కర్, సమ్మయ్య, ఆంజనేయులు, కూమార్, నవీన్, మాకల ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినికి..



బచ్చన్నపేట: జిల్లాకేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీల్లో మండలంలోని బిషప్ తుమ్మబాల పాఠశాల విద్యార్థి యశస్విని జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి గెలుపొందింది. కాగా, సోమవారం హెచ్‌ఎం వై.బాలరెడ్డి, ఉపాధ్యాయులు.. యశస్వినికి బొకే ఇచ్చి అభినందించారు. టీచర్లు అశోక్, భాస్కరాచారి, శాంత, ఫర్జానా పాల్గొన్నారు.

పరామర్శ



బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లిలో రిక్కల బుచ్చమ్మ, తాళ్లపల్లి నర్సమ్మ, బొడ్డు సాత్విక మృతి చెందారు. కాగా, సోమవారం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అనంతరం గ్రామస్తులు గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంబంధిత ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వారు స్పందించినట్లు గ్రామస్తులకు తెలిపారు. మల్లవరం వెంకటేశ్వర్లురెడ్డి, కాపర్తి హరిప్రసాద్, ఇమ్మడి యాకంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, మధుసూదన్‌రెడ్డి, దామోదర్, రాములు, నర్సింహులు పాల్గొన్నారు.

ఎండుతున్న పొలాలు

- వారం రోజులుగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



నీరు అందక ఎండుతున్న వరి పొలం

కొడకండ్ల: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో గత వారం రోజులుగా కరెంట్ సరఫరా నిల్చిపోయి పొలాలు ఎండిపోతున్నాయని ఏడునూతుల గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారులోని కర్ణాల కుంట సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన లైన్‌లో గత వారం రోజుల క్రితం రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరా లేక 20 ఎకరాలకు పైగా వరి పొలాలు నీరందక ఎండిపోతున్నాయని పరిసర రైతులు తెలిపారు. అలాగే ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలో కూడా మొక్కలకు నీరందక ఎండిపోతుండటంతో సిబ్బంది ట్యాంకర్‌తో నీరందించాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు కొత్త స్తంభాలు ఏర్పాటు చేసిన విద్యుత్ అధికారులు లైన్ గుంజి విద్యుత్ పునరుద్ధరించడంలో అలసత్వం వహించడం వల్ల పొలాలు ఎండి నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది. అనేక వ్యవప్రయాసాలతో సాగు చేసిన పొలాలు బోర్‌బావుల్లో నీరుండి కూడా విద్యుత్ సరఫరా లేక నీరందించుకోలేని పరిస్థితి ఏర్పడిందని సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్రాన్ని దోచుకుంటున్న మంత్రులు

మాజీ ఎమ్మెల్యే రాజయ్య



రైతుదీక్షలో మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ కేబినెట్‌లో సీఎంతో సహా మంత్రులంతా అవినీతితో తోడుదొంగల్లా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ.. రైతు వ్యతిరేక విధానాలపై ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సోమవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాజయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిమయమైందని, మంత్రులు ఎవ్వరికి వారే దుకాణాలు తెరుచుకున్నారన్నారు. భట్టి విక్రమార్క సతీమణి సైతం వసూళ్లకు పాల్పడుతుందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గంలో బెదిరింపులు, అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. కడియం నా నోటి కాడి బుక్కను లాక్కుని బీఆర్‌ఎస్ నుంచి టికెట్ పొంది ఎమ్మెల్యేగా గెలిచాడని, అదేవిధంగా పదేళ్లు కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన సోదరి ఇందిరను మోసం చేస్తూ కాంగ్రెస్‌లోకి వెళ్లాడన్నారు. జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కబడ్దార్ కాంగ్రెస్ గుండాల్లారా, బీఆర్‌ఎస్ శ్రేణుల ఓపికను పరీక్షించవద్దని హెచ్చరించారు. కాగా, బీఆర్‌ఎస్ రైతు దీక్ష సందర్భంగా ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ భీమ్‌శర్మ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించారు. దీక్షలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేక గొడవలు

ఏఎంసీ చైర్మన్ శివరాజ్ యాదవ్



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శివరాజ్ యాదవ్

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే అభివృద్ధిని ఓర్వలేని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గొడవలు సృష్టిస్తున్నారని ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించేందుకు జనగామ మండలం ఎర్రగుంట తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి పొంగులేటిని ఆహ్వానించడం జరిగిందన్నారు. పథకాలు అందిస్తుంటే కాంగ్రెస్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ తట్టుకోలేక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనుచరగణంతో ఎర్రగుంటతండాకు వచ్చి ముందుగానే వేదికపైకి ఎక్కి ఉద్రిక్తతలకు కారణమయ్యాడన్నారు. ప్రజలకు మంచి జరుగుతుంటే ఎమ్మెల్యేగా స్వాగతించాల్సింది పోయి, అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ఇలానే చేస్తే నియోజకవర్గంలో ఎమ్మెల్యేను తిరగనివ్వమన్నారు. సమావేశంలో దూడల సిద్ధయ్యగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గణిపాక మహేందర్, గుండా శ్రీధర్‌రెడ్డి, మెరుగు బాలరాజు, సా దం జంపన్న, జగదీష్, నామాల శ్రీనివాస్, కట్ట కృష్ణ, బిక్షపతి, మారబోయిన ప్రకాష్, బాల్నే సత్యనారాయణ, తుపాకుల రాములు, జనార్ధన్, చామకూర చిరంజీవి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

‘బండి సంజయ్‌ని విమర్శించే హక్కు ఎమ్మెల్యే శ్రీహరికి లేదు’

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/చిల్పూరు: బీజేపీ నేత బండి సంజయ్‌ను విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుగులోత్ మధునాయక్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాల అధ్యక్షులు గంటె ఉపేందర్ యాదవ్, కోరుకొప్పుల నాగేశ్‌గౌడ్ కుమ్మం సతీష్ అన్నారు. సోమవారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడారు. బండి సంజయ్‌ను ప్రభుత్వ పథకాలు నీ అయ్య జాగీరా అంటూ కడియం అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలకు ఇందిరమ్మ పేరు ఎలా పెడతారని, సొమ్ము ఒకరిది సోకు మరొకరిదా అని ప్రశ్నించారు. ప్రజాబలంతో కిందిస్థాయి నుంచి రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగిన ప్రజానేత బండి సంజయ్ అని, మరోసారి విమర్శలు పునరావృతమైతే బీజేపీ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవన్నారు. ఆయా సమావేశాల్లో నాయకులు వెలిశాల శ్రీనివాస్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

‘దాడులు సరికాదు’

జనగామ రూరల్: మండలంలోని ఎర్రకుంటతండాలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పరస్పరం దాడులు చేసుకోవడం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి బోడ నరేందర్ అన్నారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వర్గాల మధ్య జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోత్కనూరి ఉపేందర్, సాంబరాజు దుర్గ ప్రసాద్, రామవత్ మిట్యా నాయక్, శ్రీరాములు పాల్గొన్నారు.

‘ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలి’

కొడకండ్ల: జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టడంతో పాటు హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి పాడిశెట్టి వెంకన్న, జిల్లా అధ్యక్షుడు తండ రమేశ్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో శ్రీశైలం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ తాటి చెట్లపై నుంచి పడి చనిపోయిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ప్రమాదావశాత్తు వికలాంగులైన వారికి కూడా తక్షణ సాయం నిధులు కూడా మంజూరు చేయాలని, గౌడ సొసైటీలకు ఐదు ఎకరాలు భూమి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. కిషన్, సోమన్న, సతీష్‌గౌడ్, ఉప్పలయ్య, శ్రీనివాస్, వెంకన్న, సైదులు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

‘రోడ్డుకు మరమ్మతులు చేయాలి’

జఫర్‌గఢ్: మండలంలోని సాగరం నుంచి గర్మిళ్లపల్లి వరకు ఉన్న తిడుగు రోడ్డుకు మరమ్మతులు చేయాలని మహాజన ప్రజాపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిడుగు రహదారి దెబ్బతిని ప్రమాదకరంగా మారిందన్నారు. రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగు చేసి ప్రజల ఇబ్బందులను తొలిగించాలని ఆయన కోరారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

జనగామ రూరల్: మండలంలోని శామీర్‌పేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన మహిళా కమిటీ సోమవారం ఎన్నికైంది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మల స్వామి ఆధ్వర్యంలో సభ్యులకు ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య గుర్తింపు కార్డులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు చేర్యాల సత్యనారాయణ, గువ్వ ఉప్పలయ్య, పిట్టల రవీందర్, సిద్ధులు పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

దేవరుప్పుల: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఈదునూరి నర్సింహారెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని హైస్కూల్, కస్తూర్బా హాస్టల్‌లో లయన్ హరికిషన్‌రెడ్డి, రేపూరి రమణారెడ్డి సౌజన్యంతో పరీక్ష ప్యాడ్‌లు, ఆల్‌ఇన్‌వన్ బుక్స్ మెటీరియల్‌ను అందజేశారు. హెచ్‌ఎం, ప్రత్యేకాధికారి సుకన్య, క్లబ్ ప్రతినిధులు, గోలి పెద్ద ఉప్పల్ రెడ్డి, పట్టాభి రాంరెడ్డి పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

భువనగిరిటౌన్: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న దొంగను సోమవారం పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన యాట రమేష్ భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీలో ఈ నెల 25న దొంగతనం చేసేందుకు వచ్చాడు. అతడు అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేయగా తప్పించుకుని పారిపోయాడు. అర్బన్ కాలనీకి చెందిన సాయికుమార్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం భువనగిరి బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న రమేష్‌ను పట్టుకుని విచారించగా.. గతంలో పలు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకోవడంతో రిమాండ్ చేసి హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

బూర్ల కల్యాణ్‌కు అవార్డు



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లుకు చెందిన బీటెక్ విద్యార్థి బూర్ల కల్యాణ్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డును అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ప్రతీ ఏటా ప్రత్యేకమైన ఆవిష్కరణల కోసం కృషి చేసే ప్రతిభావంతులను గుర్తిస్తూ అందించే తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్–2025 తరఫున ఈనెల 26న ఛాగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జీపీ కార్యదర్శి సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కాలేజ్ కాన్సెంట్ పేరుతో డిజిటల్ ప్లాట్‌ఫాం రూపొందించినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యాడు. డిజిటల్ ప్లాట్‌ఫారం విద్యార్థులకు విద్యకు సంబంధించిన అన్ని అవసరాలను తీర్చిదిద్దేలా రూపొందించబడిందని, ఈ ప్లాట్‌ఫాంలో పుస్తకాలు కొనుగోలు చేయడం, విక్రయించడం, మెంటర్‌ల సహాయం పొందడం, స్టడీ గ్రూప్స్‌తో జట్టు అభ్యాసం చేయడం తదితర అనేక ఫీచర్లు ఉన్నాయని కల్యాణ్ తెలిపారు. కాగా, విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు పొందిన కల్యాణ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఒకేసారి సొసైటీ ఎన్నికలు నిర్వహించాలి

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా ఒకేసారి గొర్రెల పెంపకందారుల సహకార సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి సాదం రమేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు మోటె దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు జీగారి యాదగిరి, గుండ వెంకటయ్య, బూమాండ్ల కుమారస్వామి, బొల్లరాజు కుమార్ పాల్గొన్నారు.

ఐలయ్య మృతి తీరని లోటు

జీఎంపీఎస్ గౌరవ అధ్యక్షుడు కాసాని ఐలయ్య మృతి ఉద్యమానికి తీవ్ర లోటని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి సాదం రమేశ్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఐలయ్య చిత్రపటానికి నాయకులతోకలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రయ్య, రాజు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల సందర్శన



డాక్టర్‌తో మాట్లాడుతున్న టీం సభ్యులు

లింగాలఘణపురం/రఘునాథపల్లి: లింగాలఘణపురం, రఘునాథపల్లి మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సోమవారం నేషనల్ పబ్లిక్ రీసెర్చ్ సెంటర్ టీం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో చేపట్టిన 14 రకాల పనులను వారు పరిశీలించారు. అంతేకాకుండా ఆస్పత్రుల్లో డెలివరీ రూమ్, ల్యాబ్, ఫార్మసిస్టు గదిని పరిశీలించారు. అంతేకాకుండా ఆస్పత్రుల్లో కాన్పులు పెంచాలని సూచించారు. రోగులకు అందుతున్న సేవలపై వారినే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీరి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్, వైద్యాధికారి కమల్‌హాసన్, డాక్టర్లు భాస్కర్, రవితేజ, స్వర్ణలత, రజియా, సుల్తానా, సీహెచ్‌ఓ రామ్‌కిషన్ ఫార్మసిస్టు స్రవంతి, సూపర్‌వైజర్లు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికుల సంక్షేమానికి కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి, విజయకుమార్, వెంకటేశ్వర్లు

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: గీత కార్మికులకు అన్ని రంగాల్లో ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం వద్ద గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ రూపొందించిన క్యాలెండర్‌ను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే మాట్లాడుతూ గీతకార్మికులకు కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్లను అందజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామిగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు నర్మెట శ్రీనివాస్, పాడిశెట్టి శ్రీనివాస్, తాళ్ల సోమనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్, ప్రముఖ కవి, రచయిత పొట్లపల్లి శ్రీనివాస్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని యువ కవి, రయిత పాలకుర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గూడూరు లెనిన్‌ను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ రీజియన్ చైర్మన్ రాపాక విజయ్, సోమనాథ కళాపీఠం అధ్యక్షులు డాక్టర రాపోలు సత్యనారాయణ, డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు, యువత

జనగామ రూరల్: ఏబీవీపీ జనగామ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రిస్టన్ గ్రౌండ్‌లో విద్యార్థులకు క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ విభాగ్ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్ రెడ్డి హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ హృతిక్ సాయి, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, గుంటుపల్లి కార్తీక్, ఉమర్ మహేందర్,గణేష్ ,నితీష్,సాయి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

ఎస్సై నవీన్‌కుమార్



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

చిల్పూరు: రోడ్డు భద్రత ప్రతీఒక్కరి బాధ్యత అని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని వంగాలపల్లి–కరుణాపురం జాతీయ రహదారిలో సోమవారం రోడ్డు భద్రతపై ప్రజలకు, వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, సరైన కాగితాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. యూటర్న్‌ల వద్ద వేగాన్ని తగ్గించి నెమ్మదిగా వెళ్లాలన్నారు. కానిస్టేబుల్ చారి తదితరులు పాల్గొన్నారు.

‘పాత పెన్షన్ విధానం అమలు చేయాలి’



జనగామ రూరల్: నాయబ్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు



దేవరుప్పులలో..

జనగామ రూరల్/జఫర్‌గఢ్/కొడకండ్ల/బచ్చన్నపేట/దేవరుప్పుల/పాలకుర్తి టౌన్: ఉపాధ్యాయ ఉద్యోగుల కుటుంబాలకు చేయూతనిచ్చే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు జనగామ, దేవరుప్పుల, జఫర్‌గఢ్, కొడకండ్ల, బచ్చన్నపేట, పాలకుర్తి మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయ ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీపీఎస్‌కు బదులు కేంద్ర ప్రభుత్వం అమలుచేయనున్న యూపీఎస్ విధానం రద్దు చేయాలని కోరారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.మహిపాల్‌రెడ్డి, నాయకులు నూకల ఎల్లారెడ్డి, అంబటి అంజయ్య, బొగ్గారపు శ్రీనివాస్, బైకాని వెంకన్న, గోలి తిరుపతిరెడ్డి, వడ్లకొండ శ్రీనివాస్, మెతుకు రాజు, భీమా, రామన్న, రామారావు, బి.పెద్దిరెడ్డి, భాస్కర్, గిరగాని వేణు, సురేష్‌రెడ్డి, ఉమేష్, అనిల్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నియామకం



సందీప్

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన చవనబోయిన సందీప్ యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు మండల అధ్యక్షుడు తాటికాయల రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సందీప్ విలేకరులతో మాట్లాడుతూ తన సేవలను గుర్తించి యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక చేయడం సంతోషంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు చరణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బోనాసి క్రాంతి కుమార్ తదితరులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో యూత్ కాంగ్రెస్ బలోపేతంతో పాటు పార్టీ, ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు.

రేపు ‘భూ భారతి’పై అవగాహన

పాలకుర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టంపై నియోజకవర్గ స్థాయి రైతు అవగాహన సదస్సును ఈనెల 29వ తేదీన ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి సోమవారం తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజవకర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, భూభారతి చైర్మన్ కోదండరెడ్డి, భూ భారతి రూపకర్త భూమి సునీల్‌కుమార్ హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు.

సమాజంలో ప్రతిఒక్కరూ సమానమే


ఎస్సై శ్రీదేవి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై శ్రీదేవి

తరిగొప్పుల: సమాజంలో ప్రతిఒక్కరూ సమానమే, సమాన న్యాయం అందరికీ దక్కాలని ఎస్సై గుగులోత్ శ్రీదేవి అన్నారు. రాష్ట్ర సామాజిక న్యాయ మండలి, మానవ హక్కుల మండల కార్యాలయాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ గౌరవప్రదంగా జీవించాలని, అనగారిణ ప్రజలకు అన్యాయం జరిగితే వారి పక్షాణ మానవ హక్కుల న్యాయ మండలి పోరాడుతుందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు రమేష్, మండల అధ్యక్షుడు నాంరాజశేఖర్, మాజీ ఎంపీటీసీ భూక్య జుంలాల్ నాయక్, ఉప సర్పంచ్ అంకం శ్రీనివాస్, ఆర్గనైజషన్ సభ్యులు మైలారం పద్మావతి, సుజాత, ఇల్లందుల ప్రభాకర్, బైరబోయిన విజయ, చరణ్, గణేష్, బుట్ల సుమతి, సమ్మయ్య, మల్లికార్జున్, నేతుల సత్తయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎస్సై హమీద్

బచ్చన్నపేట: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎస్‌కే హమీద్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పలువురికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు అధికారులమని ఓటీపీ అడిగితే చెప్పొద్దని అన్నారు. ఫోన్‌కి వచ్చే అనవసర లింక్‌లను కూడా ఓపెన్ చేయొద్దని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. కానిస్టేబుళ్లు అనిల్, రాకేష్, దివ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.